

ఉసురు తగలదా..

పింఛన్ల సంఖ్య మళ్లీ తగ్గిపోయింది. నెలలు గడుస్తున్న కొద్దీ పింఛన్‌దారులను తగ్గించుకుంటూ వస్తున్నారు. - 10లో



దొంగల ముఠా ఆటకట్టు

జిల్లాలోని పలు ఆలయాల్లో చోరీ చేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. ఆభరణాలను రికవరీ చేశారు. - 10లో

11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను 9, 11వ తరగతిలో సీట్లు భర్తీ చేసేందుకు లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. అక్టోబర్ 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష 2025, ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

న్యూస్‌రీల్

12 నుంచి కొత్త మద్యం పాలసీ అమలు

శ్రీకాకుళం క్రైమ్ : కొత్త మద్యం పాలసీ ఈ నెల 12 నుంచి అమలు కానుందని, దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 12 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 158 షాపులకు ఆయా యూనిట్ల పరిధిలో లైసెన్సులు మంజూరు చేస్తామని, దీనికి దరఖాస్తు చేసేవారు ఒక్కో దరఖాస్తుకు డిపాజిట్ అమౌంట్ రూ. 2 లక్షలు కట్టాల్సి ఉంటుందని అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 9 లోపు దరఖాస్తు చేసుకోవాలని, 11న కలెక్టర్ పారదర్శక పద్ధతిలో డ్రా తీస్తారని 12న రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (లైసెన్సు) పొందినవారికి షాపులు అప్పజెబుతామని తెలిపారు.

ఇసుక మాఫియాకు ప్రభుత్వ యంత్రాంగం అండ



సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: వంశధార తీరాల్లో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియాకు ప్రభుత్వ యంత్రాంగం అండగా నిలుస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు కొత్తూరులో మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక అందిస్తామని ఓట్లు వేయించుకున్న కూటమి నేతలు ఇప్పుడు సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని, భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పోయిందని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు.


వయో వృద్ధులకు ప్రత్యేక వైద్య పరీక్షలు



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కల్యాణ్‌బాబు

అరసవల్లి: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా 10 రోజుల పాటు వైద్య శాఖ తరఫున ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామని, వీటిని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఆస్పత్రుల సేవల కోఆర్డినేటర్ డాక్టర్ కల్యాణ్‌బాబు తెలియజేశారు. మంగళవారం ప్రత్యేకంగా మదర్ థెరిసా ఆశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీల్లో వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఉచితంగా షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు చేయించుకోవాలని, నెలకు ఒకసారి మానసిక వైద్యులను, నెలకు రెండు సార్లు సాధారణ వైద్యులు తనిఖీలు చేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊరు హోరెత్తేలా..



విద్యుత్ వెలుగుల్లో కొత్తమ్మతల్లి ఆలయ గాలి గోపురం (ఇన్‌సెట్‌లో) కొత్తమ్మ తల్లి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- ఘనంగా కొత్తమ్మ తల్లి జాతర ప్రారంభం

కొత్తమ్మ తల్లి జాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాలను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి దీపం వెలిగించి ప్రారంభించారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లా నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. దేవదాయ శాఖాధికారులు ఉచిత ప్రసాదం అందజేశారు. రాష్ట్రస్థాయి జాతరగా ఈ యేడు ఉత్సవం నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు, సంగిడీ, ఉలవల బస్తాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – కోటబొమ్మాళి



కొత్తమ్మతల్లి ఆలయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

పచ్చమూకల రౌడీయిజం



- శ్రీకాకుళంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై దాడి
- వేదికపై మద్యం తాగొద్దని అన్నందుకు దౌర్జన్యం
- పిడి గుద్దులతో రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు
- కేంద్రమంత్రి అనుచరుడు కొర్ను ప్రతాప్ ఫ్యామిలీ ఫంక్షన్‌లో నిర్వాకం
- దాడిని సీరియస్‌గా తీసుకున్న హోటల్ అసోసియేషన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధికారం చేతికి వచ్చాక టీడీపీ వర్గీయుల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి. జిల్లా కేంద్రంలో కొందరు నాయకులు అధికారం అండతో రౌడీయిజం చేస్తున్నాయి. తాజాగా శ్రీకాకుళంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై మంగళవారం టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారు. ఇప్పుడిది శ్రీకాకుళంలో సంచలనమైంది. హోటల్ అసోసియేషన్ సీరియస్‌గా తీసుకుంది. ఇలాగే వదిలేస్తే నగరంలో వ్యాపారులు బతకలేరని, భయంతో ఉండాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఎంతటి వారైనా వదలకూడదని హోటల్ అసోసియేషన్ ముందుకు అడుగులేస్తోంది.

హోటల్ మేనేజర్‌ని చితకబాదిన 'తమ్ముళ్లు'..

ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అనుచరుడు కొర్ను ప్రతాప్ కుటుంబీకుల ఫంక్షన్ మంగళవారం జరిగింది. ఆ ఫంక్షన్ ముగిసే సరికి సాయంత్రం 4గంటలైంది. అక్కడి హాల్ ప్రధాన వేదిక పక్కనున్న రూమ్‌లో టీడీపీకి చెందిన కొంతమంది మద్యం తాగారు. పవిత్రంగా భావించే ఇక్కడ మద్యం సేవించడం సరికాదని సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. సిబ్బంది చెప్పినా వినిపించుకోకపోవడంతో హోటల్ యజమాని నక్కా రామరాజు బావమరిది, మేనేజర్ సాధు ధనుంజయరావు వెళ్లి వారికి నచ్చజెప్పారు. కానీ, మద్యం తాగిన వ్యక్తులు వినలేదు. వినలేదు సరికదా తమకు నచ్చజెప్పిన ధనుంజయరావుపై శ్రీను, మరికొందరు దాడి చేశారు. పిడిగుద్దులు కురిపించి చెంపదెబ్బలు కొట్టారు. ఈ క్రమంలో ధనుంజయరావు చెవికి బలమైన గాయమైంది. బాధితుడు గాయాలతో ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా అక్కడి పోలీసులు రిమ్స్‌కు ముందుగా వెళ్లాలని చెప్పడంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స తీసుకోవడంతో ఆస్పత్రి అవుట్ పోస్టులో మెడికో లీగల్ కేసు నమోదైంది. తనను ఒక్కడిని చేసి పది మందికి పైగా దాడికి దిగారని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ధనుంజయరావు చెప్పారు.



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే అండతోనే..

ఒక ఎమ్మెల్యే అండ చూసుకుని పచ్చ మూకలు చెలరేగిపోతున్నాయి. ఆ ఎమ్మెల్యే కూడా ప్రోత్సహించడంతో ఈ మూకలను ఎవరూ అడ్డుకోలేకపోతున్నారు. మంగళవారం ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై దాడి చేసినాక కూడా వెనక్కి తగ్గడం లేదు. తమనెవరూ ఏమీ చేయలేరని, ఎంతవరకైనా వెళ్తామని, ఎంతైనా ఖర్చు పెడతామంటూనే ప్రలోభాల కు గురి చేస్తున్నారు. అంతటితో ఆగడం లేదు. తమ వెనక ఉన్న ఎమ్మెల్యేను కూడా రంగంలోకి దించా రు. కేసు నమోదు చేయించకుండా పోలీసు అధికారులకు ఫోన్‌లు చేసి ఒత్తిడి చేయిస్తున్నారు. అయితే మంగళవారంతో పాటు ఇటీవల కాలంలో జరిగిన పరిణామాలను చూసి వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. తాజా ఘటనతో హోటల్ అసోసియే షన్ ప్రతినిధులు మరింత సీరియస్‌గా తీసుకున్నా రు. ఇలాగే వదిలేస్తే నగరంలో వ్యాపారాలు చేయలేమని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వ్యాపారాలు చేయాల్సి వస్తుందని, దాడులకు తెగబడ్డ వా రిని వదలకూడదని నిర్ణయించుకున్నారు. దాడులు చేసిన వారు ఎలాగైతే ఎంతైనా ఖర్చు పెడతామని శపథం పూనుతున్నారో బాధితుల తరఫున హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా అదే స్థాయిలో ప్రతిఘటించాలని చూస్తున్నారు. ఇప్పటికే బాధితుడు ధనుంజయరావుకు అండగా నిలిచారు. దాడి చేసిన వారికి అండగా నిలిచిన ఎమ్మెల్యే, తదితర నేతలు కూడా ఆలోచించుకోవాలని ప్రజల్లో వ్యతిరేకత వస్తే మున్ముందు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూడా హెచ్చరికలు చేస్తున్నారు.

తన్మయాదిత్యుడు



చీకటి తెరను చీల్చుకుంటూ ఆకాశ వీధి నుంచి వచ్చిందొక కిరణం. దేవదూత సంధించిన వింటి శరంలా నేరుగా అరసవల్లి ఆలయ గోపురానికి చేరుకుంది. అక్కడి నుంచి ఈ దారులన్నీ తనకు తెలిసున్నట్టు గర్భగుడికి సూటిగా వెళ్లింది. అంతవరకు చీకటిలో ఉన్న ఆదిత్యుడి పాదాలను ముద్దాడి గర్భగుడిని తేజోమయం చేసింది. పాదాల నుంచి శిరస్సు వరకు అరుణ శిలను ఆరారా అభిషేకించి భక్తులకు తన్మయత్వం అందించింది. నాలుగు నిమిషాల పాటు జరిగిన ఈ కిరణాభిషేకం వీక్షించిన భక్తులు అవ్యక్తానుభూతికి లోనయ్యారు.

- నాలుగు నిమిషాల పాటు ఆదిత్యుని మూలవిరాట్టుపై తొలికిరణ స్పర్శ
- నేడు కూడా కిరణ దర్శనం

అరసవల్లి: ప్రఖ్యాత అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో మంగళవారం ఉదయం తొలి కిరణ స్పర్శ దర్శనం అద్భుత రీతిలో జరిగింది. ప్రతి ఉత్తరాయణ, దక్షిణాయణ కాలమార్పుల్లో భాగంగా జరిగే ఈ అపురూప దర్శనం మంగళవారం నాలుగు నిమిషాల పాటు భక్తులను తన్మయత్వానికి గురిచేసింది. ఆలయ ఈఓ వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్ల లైన్లలోకి భక్తులకు సూర్యోదయ సమయంలో అనుమతించారు. ఆలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ అంతరాలయంలో కిరణాల దర్శనం అయిన తర్వాత భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. బుధవారం ఉదయం కూడా కిరణదర్శనం ఉంటుందని, భక్తులకు అనుమతిస్తామని ఆయన ప్రకటించారు.

- మంగళవారం ఉదయం 6.08 గంటలకే సూర్యోదయ వేళల్లో తొలి లేలేత సూర్యకిరణాలు రాజగోపురం నుంచి అనివెట్టి మండపం నుంచి ధ్వజస్తంభంను తాకి అలా మహా మండపం, వైజయంతి మండపాల మీదుగా అంతరాలయ ద్వారం తాకి అనంతరం గర్భాలయంలోని స్వామి వారి అరుణశిల (మూలవిరాట్టు)పై తాకాయి.
- పాదాల నుంచి వక్షస్థలం తర్వాత ముఖభాగంపై స్వర్ణ కిరణాలు స్పృశించడంతో ఒక్కసారిగా గర్భాలయమంతా స్వర్ణమయమైంది.
- సరిగ్గా నాలుగు నిమిషాల పాటు కిరణాల స్పర్శ ఉండడంతో భక్తులందరికీ దర్శనమయ్యేలా ఆలయ వర్గాలు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ వివేకానంద బందోబస్తు ఏర్పాటు చేయగా, ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు తదితరులు కిరణ దర్శనాన్ని తొలిసారిగా తిలకించారు.



గర్భాలయంలో స్వామి వారి మూలవిరాట్టును తాకిన సూర్యకిరణాలు

మహాత్ముడి స్మృతులు



శ్రీకాకుళం కల్చరల్:

ఎన్నినాళ్లయినా మహాత్ముడి గురుతులు జిల్లా గుండె గది దాటి వెళ్లవు. ఎన్నేళ్లయినా బాపూ స్మృతులు స్మరణకు రాకుండా మానవు. నేడు ఆ మహనీయుడి జయంతి. స్వాతంత్య్ర సంగ్రామ కాలంలో గాంధీజీ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జ్ఞాపకాలన్నీ జయంతి నాడు జ్ఞప్తికి వస్తున్నాయి.

మహాత్ముడి స్మృతులు జిల్లా మదిలో ఇంకా కదలాడుతున్నాయి. స్వాతంత్య్రోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలోనే ఆయన శ్రీకాకుళం జిల్లాలో కూడా పర్యటించారు. జిల్లాలో పర్యటించినపుడు వెయ్యి రూపాయిలు ఇచ్చిన వారి ఇంటికే వెళతానని ఆయన ప్రకటించారు. హరిజనోద్ధరణకు విరాళాలను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

- 1927లో జిల్లాకు వచ్చిన మహాత్మాగాంధీని శ్రీకాకుళం వాసులు డిసెంబరు 2న ఘనంగా సత్కరించారు. ఈ పౌర సన్మాన సభలో ఖద్దరు వస్త్రంపై రాసిన సన్మాన పత్రాన్ని మహాత్మాగాంధీకి అందజేశారు. గాంధీజీ ఆ రాత్రి ఎంబాడ హనుమంతరావు పంతులు ఇంట్లో బస చేశారు. బొంతల కోడూరు సన్న ఖాదీ కార్మికులు ఇచ్చిన సన్నఖాదీని చూసి మహాత్ముడు అబ్బురపడ్డారు.




శ్రీకాకుళంలో గాంధీజీ బసచేసిన భవనం

- మహాత్మాగాంధీ 1927 డిసెంబరు 2, 3 తేదీల్లో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహించిన పర్యటనలో హిరమండలానికి చెందిన అంధవరం వెంకటరెడ్డి తన కారును ఇచ్చారు.

గాంధీ మందిరం..

గాంధీజీ గుర్తుగా శాంతినగర్ కాలనీలో గాంధీ గుడి, స్వాతంత్య్ర సమరయోధుల స్మృతివనం ఏర్పాటు చేశారు. దశాబ్దాల కిందటే జిల్లా కేంద్రంలో గాంధీజీ పేరుతో పార్కును ఏర్పాటు చేశారు.

దూసిలో..



దూసి రైల్వేస్టేషన్‌కు వచ్చిన మహాత్మా గాంధీ

ఆమదాలవలస: 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా గాంధీజీ దూసి రైల్వే స్టేషన్‌లో దిగి ప్రసంగించారు. అనంతరం ఇక్కడే ఓ మర్రి చెట్టును నాటినట్టు చెబుతున్నారు. ఆయనకు గుర్తుగా గాంధీ రైల్వేస్టేషన్ అని పేరు పెట్టాలని భావించినా ఇంకా కార్యరూపం దాల్చలేదు.


ఊరు ప్రశాంతంగా ఉండాలని..



కేదారిపురంలో గాంధీజీకి పూజలు చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ: దేశమంతటికీ గాంధీ మహాత్ముడు స్వాతంత్య్ర యోధుడైతే పలాస మండలం కేదారిపురం వాసులకు మాత్రం దేవుడు. 1947లో స్వాతంత్రం వచ్చినప్పటి వీరు ఊరిలో గాంధీజీ పేరుతో గాంధమ్మ సంబరం చేస్తున్నారు. ఉభాలకు ముందు ఈ సంబరం చేస్తారు. దీని ద్వారా గొడవలు పోయి ఊరు ప్రశాంతంగా ఉంటుందని ఈ పద్ధతిని తీసుకువచ్చారు. గ్రామ రామాలయం ముందు ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి అదే విగ్రహానికి ఎదురుగా ఆయన చిత్రపటం కుర్చీపై పెట్టి పూజలు చేయడం ఇక్కడి ఆనవాయితీ. ఈ ఏడాది కొత్త తరం కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించింది.

బాపూజీ బస ఇక్కడే



గాంధీ బస చేసిన ప్రదేశంలో నిర్మించిన గ్రంథాలయం

సారవకోట: 1927లో సారవకోటకు మహాత్మా గాంధీ వచ్చారు. అప్పట్లో బోయిన అప్పలస్వామి గాంధీజీకి ఆతిథ్యమిచ్చారు. ఆయనకు అప్పలస్వామి మేకపాలు, స్థానికంగా దొరికే పండ్లను ఆహారంగా ఇచ్చా రు. గాంధీ బస చేసిన ప్రదేశంలో శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి దానికి మహాత్ముడి పేరునే పెట్టారు.

ఆ రూపం అపురూపం

గాంధీ జయంతి సందర్భంగా రణస్థలం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో గాంధీ చిత్రాన్ని ఆవిష్కరించారు. సుమారు 600 మంది విద్యార్థులతో 120 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పుతో బాపూ చిత్రం ఆకారంలో విద్యార్థులు కూర్చుని ప్రదర్శన చేశారు. – రణస్థలం



విద్యార్థులతో బాపూ చిత్రం

97.89 శాతం పింఛన్ల పంపిణీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్‌టీఆర్ పింఛన్ భరోసా కార్యక్రమంలో భాగంగా తొలిరోజు ఒకటో తేదీ మంగళవారం జిల్లాలో పింఛన్లు పంపిణీ 97.89 శాతం పూర్తయ్యింది. జిల్లాకు ఈ నెలకు గాను 3,15,630 పింఛన్లు విడుదల కాగా, వీటిలో మంగళవారం సాయంత్రం వరకు 3,08,966 మందికి పింఛను అందజేశారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించాల్సిందే

బూర్జ: మండలంలోని మామిడివలస పంచాయతీ కాఖండ్యాం ఇసుక ర్యాంపును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ బుకింగ్, మాన్యువల్ బుకింగ్‌లో తేడాలు గమనించారు. రికార్డులు, ఇసుక స్టాక్ పాయింట్, తనిఖీల కేంద్రాలు పరిశీలించారు. ప్రైవేట్ బుకింగ్‌లు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన (వేళలలోనే) సమయంలోనే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలన్నారు. అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని చెప్పారు.

టెక్కలి పీఆర్ ఈఈ వేధింపులు సరికావు

అరసవల్లి: టెక్కలి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఈగా విధుల్లో ఉన్న సూర్యప్రకాష్, శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను వేధించడం తగదని పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణరావు, జెడ్పీ యూనిట్ అధ్యక్షురాలు పి.జయమ్మలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఈఈ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శోభారాణిని టార్గెట్ చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేశారని గుర్తుచేశారు. టెక్కలి పీఆర్ కార్యాలయంలో ఈఈ నుంచి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నామని వారు విజ్ఞప్తి చేశారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై సూచనలివ్వండి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములై తమ అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికను రూపొందించడంలో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా తొలి స్థానంలో నిలిచిందని, ఇంకా సమయం ఉన్నందున స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని అన్ని వర్గాలను కోరుతున్నట్టు చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలసి రెవెన్యూ ఫ్రీ హోల్డ్ సర్వే, కోర్టు కేసులు, రీ ఓపెన్ గ్రీవెన్స్, ఓటర్ల జాబితా రూపకల్పన, స్వచ్ఛతా హీ సేవ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ఉపాధి హామీ పనులు, 100 రోజుల ప్రగతి మొదలైన అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మీ కోసంలో వచ్చే ఫిర్యాదులను సరైన కారణాలు లేకుండా తిరస్కరించవద్దని, రీ ఓపెన్ చేసిన అర్జీలను నిశితంగా పరిశీలించి అవసరమైన సందర్భంలో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మన ఇళ్లు మన గౌరవం హౌసింగ్ కార్యక్రమంలో ప్రతివారం కచ్చితమైన పురోగతి ఉండాలన్నారు.

మానిటరింగ్ సభ్యులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అభ్యర్థులు ఐదుగురిని, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు బీసీ, ఓసీ కులాలకు చెందిన ముగ్గురిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వ్యక్తులు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయానికి ఈనెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వజ్రపుకొత్తూరు రూరల్: బెండిగేటు జంక్షన్‌లో మంగళవారం ఓ మహిళ మెడలో ఉన్న బంగారం గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఏఎస్ఐ జిన్నారావు తెలిపారు. ఉద్దానం మెళియాపుట్టి గ్రామానికి చెందిన బొమ్మాళి సరోజనమ్మ తన భర్త లక్ష్మయ్యతో కలిసి స్వగ్రామం నుంచి గరుడఖండి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి బాధితురాలు మెడలో ఉన్న తులంనర బంగారం గొలుసును ఒక్కసారిగా తెంపుకొని వెళ్లిపోయాడు. చుట్టుపక్కల గాలించినా అతడు దొరకలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొర్లాం సమీపంలో..

సోంపేట: కొర్లాం జాతీయ రహదారి వద్ద మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కలిపిల్లి పుణ్యావతి పొలం పనులు చూసుకుని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడును తెంపుకుని వెళ్లిపోయారు. ఆమె కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బారువ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మూడు రోజుల కిందటే సోంపేట పట్టణంలో మహదేవి పేటలో 5 తులాల బంగారాన్ని ఇంటిలో ఉన్న మహిళ నుంచి దోచుకుని వెళ్లారు. వరుస చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉసురు తగలదా..

- ప్రతి నెలా తగ్గిపోతున్న పింఛన్ల సంఖ్య
- ఫిర్యాదులతో పింఛన్ల తొలగింపు
- ఇప్పటికి 4వేలకు పైగా పింఛన్ల కోత


నారాయణవలసలో ఇలా..

చెట్టు కింద పింఛన్ల పంపిణీ

నరసన్నపేట: ఇంటి వద్దకు పింఛన్లు అందిస్తున్నామని కూటమి నాయకులు చెబుతున్న మాటలు అబద్ధాలే అని తేలుతున్నాయి. ఒకప్పుడు తెల్లవారే సరికి ఇంటికి వచ్చి వలంటీర్లు తలుపు కొట్టి పింఛన్ ఇచ్చే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వృద్ధులు, దివ్యాంగులు అంటున్నారు. కరగాం పంచాయతీ నారాయణవలసలో సోమవారం ఓ చెట్టు కిందకు అందరినీ పిలిచి పింఛన్లు అందించారు. పింఛన్లు తీసుకోవడానికి వృద్ధులు ఇబ్బంది పడ్డారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వంలో పింఛన్ల తీసివేత ప ర్వం నడుస్తోంది. ఒకేసారి పెద్ద ఎత్తున తీసేస్తే ప్రజ ల నుంచి వ్యతిరేకత వస్తుందని నెలవారీ తీసివేసే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. 100 రోజుల పాలనలో జిల్లా వ్యాప్తంగా 4వేలకు పైగా పింఛన్లు కోతకు గురయ్యాయి. నేరుగా తొలగించిన పింఛన్లతో పాటు కొందరివి తెలివిగా హోల్డ్‌లో పెడుతు న్న పరిస్థితులు ఉన్నాయి. పచ్చనేతల ఫిర్యాదుతో కొందరి పింఛన్లను మైగ్రేషన్(వలస) పేరుతో వాటిని పక్కన పెట్టి ఉంచుతున్నారు. ఇవి అధికారికంగా తీసివేసినట్టు రికార్డుల్లో కనిపించవు. టీడీపీ నేతలు దయతలిస్తే హోల్డ్‌లో నుంచి రిలీవ్ అవుతాయి. లేదంటే కొన్నాళ్లకే ఆ పింఛన్లను పూర్తిగా తొలగించే అవకాశం ఉంది.

దివ్యాంగులపై కుట్రలు

అభాగ్యులపై కుట్రలు కొనసాగుతున్నాయి. వృద్ధులు, వికలాంగుల పింఛన్లను అనర్హుల పేరుతో ఏరివేతలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వేలాది మంది వికలాంగులకు సంబంధించి ఫిర్యాదులు వెళ్లగా, వాటిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని రిమ్స్ వైద్యులకు లిఖిత పూర్వక ఆదేశాలు వచ్చాయి. దీంతో వైద్యులు కూడా డిఫెన్స్‌లో పడుతున్నారు. గతంలో ఇచ్చిన సదరం ధ్రువీకరణ పత్రం తప్పు అని చెప్పలేక ప్రస్తుత పాలకుల ఒత్తిళ్లు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలన కోసం వచ్చిన వికలాంగ పత్రాలను రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని ఫోన్ల ద్వారా, సంబంధిత అధికారుల ద్వారా సతాయిస్తున్నారు. మరోవైపు పింఛన్ ఆపేస్తామని వైద్యుల వద్దకు వెళ్లి పునః పరిశీలన చేసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులు చెప్పడంతో ఆందోళనతో దివ్యాంగులు రిమ్స్‌కు పరుగులు పెడుతున్నారు.

వ్యూహాత్మకంగా నిలిపివేత..

వృద్ధుల పింఛన్ల విషయంలో కూడా కూటమి నాయకులు కుతంత్రాలు చేస్తున్నారు. లబ్ధిదారుల పిల్లలు ఉద్యోగాలు చేస్తున్నారని, వారికి పెద్ద ఎత్తున ఆస్తులు ఉన్నాయని, ఇతరత్రా ఆదాయ మార్గాలున్నాయని ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో అధికారులు కూడా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తున్నారు. దాదాపు ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ఈ రకమైన పరిస్థితులు ఉన్నాయి. నోటీసులకు వివరణ ఇచ్చే లోపు వారికి సంబంధించిన పింఛన్లు పంపిణీ చేయకుండా హోల్డ్‌లో పెడుతున్నారు. రికార్డుల్లో హోల్డ్ అనే ఆప్షన్ లేకపోవడంతో మైగ్రేషన్(వలసపోయారు) అని చూపించి, పంపిణీ చేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. ఉదాహరణగా సెప్టెంబర్ పరిణామాలనే తీసుకోవచ్చు. ఆ నెలలో 1607వరకు లబ్ధిదారులు మైగ్రేషన్‌లో ఉండటం వల్ల పంపిణీ చేయలేకపోయామని అధికారుల నివేదికలో పేర్కొని ఉంది.

నెలవారీ కోతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్ నుంచి జూలైకి 555 మంది పింఛన్లు ఆపారు. అక్కడికి నెల తర్వాత 1130 మంది పింఛన్లు తీసేశారు. ఆ నెల త ర్వాత 1134 మంది పింఛన్లు ఆపేశారు. ఈ నెలలో 1235 పింఛన్లు అందకుండాపోతున్నాయి. ప్రతి నెలా పింఛన్ల సంఖ్యలో కోత కనిపిస్తూనే ఉంది. మొత్తంగా చూస్తే ఈ ప్రభుత్వంలో ఇప్పటివరకు 4,072 పింఛన్లు తీసివేసింది. తాజాగా కూడా టీడీపీ నాయకుల ఒత్తిడి, సిఫార్సు మేరకు మంజూరైన పింఛన్లు కూడా చాలా వరకు ఆపేశారు. తాము చెప్పిన వాళ్లకు పింఛన్ సొమ్ము ఇవ్వవద్దని మౌఖికంగా చెప్పడంతో పెండింగ్‌లో పెడుతున్నారు.

నాడు– నేడు తేడా..

గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకుని నమోదు చేయించుకునే అవకాశం ఉండేది. పరిశీలన పూర్తయ్యాక పింఛన్ల మంజూరు జరిగేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ఇంతవరకు కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశమే కల్పించలేదు.

	ఈ ఏడాది జూన్ ఒకటి నాటికి	జూలై ఒకటి నాటికి	ఆగస్టు ఒకటి నాటికి:	సెప్టెంబర్ ఒకటి నాటికి:	అక్టోబర్ ఒకటి నాటికి
పింఛన్లు:	3,19,702	3,19,147	3,18,017	3,16,883	3,15,630

● ఎండ ప్రచండం


వానాకాలంలో ఎండలు దంచేస్తున్నాయి. మంగళవారం ఎండ ధాటికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులపై నడవడానికి కూడా ఆపసోపాలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిద్దాం


వైఎస్సార్ కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆంధ్రుల ఆత్మబలి దానాలతో సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నడుం కట్టాలని, స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ప్రజానాట్యమండలి కళాకారులు చింతాడ రామచంద్రరావు, ఎస్.శ్రీనివాస్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పాటలు పాడుతూ పోరాటానికి మద్దతు తెలిపారు. వక్తలు మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని అన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నా ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవని అన్నారు. సొంత గనులున్న ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలు ఇనుప ఖనిజం తవ్వి తీసుకోవడానికి టన్నుకు రూ.500 మాత్రమే ఖర్చవుతుందని, కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఇనుప ఖనిజం టన్ను రూ. 5,940 పెట్టి మార్కెట్‌లో కొనాల్సి వస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పుట్టినప్పటి నుంచి కేంద్రం పెట్టిన పెట్టుబడి కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమేనని, విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటి వరకూ పన్నులు, డివిడెండ్ల రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు పైగా చెల్లించిందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు టీడీపీ హామీ ఇచ్చిందని, ఎందుకు కాపాడలేకపోతోందని ప్రశ్నించారు. దీక్షల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, చిక్కాల.గోవిందరావు, వైఎస్ఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు, ఎస్. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు


ఎంపికల్లో భాగంగా విల్లు ఎక్కుపెడుతున్న ఆర్చరీ క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా 35 క్రీడాంశాల్లో ఎంపిక పోరు కొనసాగింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, పాత్రునివలస, టెక్కలి, తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు, బాలబాలికలు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. త్వరలోనే రాష్ట్రపోటీలకు వెళ్లే షెడ్యూల్ ప్రకారం ఎంపికైన క్రీడాకారుల జాబితాలను వెల్లడిస్తామని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అండర్–14,17,19 వయో విభాగాల్లో లాన్‌టెన్నిస్, బాలురకు బాల్‌బ్యాడ్మింటన్, పెద్దపాడులో వెయిట్‌లిఫ్టింగ్, సీతంపేట మినీ స్టేడియంలో ఆర్చరీ తదితర క్రీడాంశాల్లో ఎంపికలను నిర్వహించారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: భారత సంచార నిగమ్ లిమిటెడ్ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ నాయుడు మద్రి మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సంస్థ ఆకర్షణీయమైన ప్యాక్‌లతో వినియోగదారులను విపరీతంగా ఆకట్టుకుంటోందన్నారు. పోర్ట్ అవుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. గత మూడు నెలల్లో 12,280 మంది వినియోగదారులు ప్రైవేటు సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్ అయ్యారన్నారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ సేవలను వివరిస్తూ ర్యాలీ చేశారు.

టీడీపీ కార్యకర్తల దుశ్చర్య

- వేములవాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడి మామిడి మొక్కల నరికివేత
- గ్రామంలో మంచినీటి మోటారు విద్యుత్ కనెక్షన్ తొలగింపు


మామిడి మొక్కలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: టెక్కలి మండలం వేములవాడ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు దుశ్చర్యకు పాల్పడ్డారు. పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలాకి చంద్రశేఖర్‌కు చెందిన మామిడి మొక్కలను సోమ వారం అర్ధరాత్రి నరికివేశారు. చంద్రశేఖర్ కోడలు లక్ష్మి పంచాయతీకి సర్పంచ్ కావడంతో పంచాయతీ నిధులు, చంద్రశేఖర్ సొంత ఖర్చులతో వేములవాడ, విశ్వనాథపురం, శ్రీరంగం గ్రామాలకు మంచినీటి సరఫరా కోసం వేసిన మోటారు విద్యుత్ వైర్లను తొలగించి రాక్షసానందం పొందారు. ఒక వైపు చంద్రశేఖర్‌ను వ్యక్తిగతంగా నష్ట పరచడంతో పాటు పంచాయతీ ప్రజలకు నీటి ఇబ్బందులకు గురి చేసే విధంగా టీడీపీ కార్యకర్తలు చేసిన పనిపై పంచాయతీ ప్రజలు మండిపడుతున్నారు. ఈ రెండు సంఘటనలపై పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు సోమేశ్వరరావు, హేమసుందర్ కారణమంటూ అనుమానితులుగా భావిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్ ఎంపీపీ పి.రమేష్‌తో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, నాయకులు హెచ్.వెంకటేశ్వరరావు, ఆర్.జయమోహన్, ఎ.రాహుల్, జి.మోహన్‌రెడ్డి, వి.తవిటయ్య, ఎస్.సుధాకర్, డి.కూర్మారావు, పి.శ్రీను, బి.రాజేష్ తదితరులు వేములవాడ గ్రామానికి చేరుకుని బాధితుడికి అండగా నిలిచారు. ఈ సంఘటనలపై బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ (బీఎస్సీ/ బీటెక్)లో కంప్యూటర్ సైన్స్ చదివి పీజీలో (ఎంసీఏ/ ఎమ్మెస్సీ/ ఎంటెక్) కంప్యూటర్ సైన్స్‌లో కనీసం 55% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 5వ తేదిన ఉదయం 10 గంటలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం వద్దకు హాజరుకావాలని సురేఖ పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న తిలక్


క్షతగాత్రులకు వైద్యం చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి, టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తన వాహనంలో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే... మంగళవారం నందిగాం మండలం పెంటూరు గ్రామానికి చెందిన ప్రగడ బాలకృష్ణ, సనపల గోవింద్ తదితరులు ద్విచక్రవాహనంపై వెళ్తూ జాతీయ రహదారిపై గొల్లూరు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అదే మార్గంలో వాహనంలో వెళ్తున్న తిలక్ వారిని గమనించి హుటాహుటిన క్షతగాత్రుల వద్దకు వెళ్లి వారికి సపర్యలు చేశారు. ఇద్దరిని తన వాహనంలో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యం చేయించారు. ఈ సాయంపై క్షతగాత్రులతో పాటు కుటుంబ సభ్యులకు తిలక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపే లక్ష్యంగా..


ఎచ్చెర్ల బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం ముందు అన్‌లోడ్ చెయ్యక నిలిచిపోయిన మద్యం లారీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు 193 ఉండగా, ప్రతి మద్యం షాపుల్లో సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్‌లు, ఒక నైట్ సెక్యూరిటీ వాచ్‌మెన్ పనిచేసున్నారు. సెప్టెంబర్ 30వ తేదీతో కాంట్రాక్టు ముగియటంతో వీరిని రెన్యువల్ చేయలేదు. కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ పోరాటం చేస్తున్నా కనీసం ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదు. మరోపక్క ప్రైవేట్ మద్యం పాలసీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 12వ తేదీ నుంచి ఈ విధానం అమలు చేయనుంది. ప్రస్తుతం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో రూ. 2లక్షలు నాన్ రిఫండబుల్ రుసుముతో దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం మద్యం షాపులు తెరవలేదు. కొన్ని షాపులు మాత్రమే తెరచుకున్నాయి. మరోపక్క స్టాక్‌ను ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి స్వాధీనం సైతం చేసుకోలేదు. ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ గోదాం నుంచి మద్యం షాపులకు ఎలాంటి సరఫరా చేయలేదు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ బార్లకు మాత్రం కావాల్సినంత మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ నెల 12 నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మద్యం షాపులు వెళ్లనున్నాయి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఉదయం నుంచి ఆందోళనలు చేసి, నిరసనలు తెలిపినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు.

దొంగల ముఠా ఆటకట్టు

- దేవాలయాల సొత్తు దొరికింది
- జిల్లాలో ఐదుగురు, కోనసీమలో మరో నలుగురు దొంగల పట్టివేత
- వీరిలో ఏడుగురు జిల్లా వాసులే
- 43 చోరీల్లో వీరి హస్తం
- భారీ కేసును ఛేదించిన పోలీసులు


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి, కింద రికవరీ చేసిన దేవుళ్ల ఆభరణాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసులు భారీ కేసును ఛేదించారు. దేవాలయాల్లో తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 36 తులాల బంగారం, 11.5 కిలోల వెండి, రూ. 3.38 లక్షల నగదును రికవరీ చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రాతినిధ్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణతో జేఆర్ పురం సీఐ ఎం.అవతారం ఇన్‌చార్జిగా ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

ఇలా పట్టుకున్నారు..

వరుసగా జరుగుతున్న చోరీలను అరికట్టేందుకు డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో జేఆర్ పురం సీఐ అవతారంను ఇన్‌చార్జిగా పెట్టి ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరిలో నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎచ్చెర్ల, లావేరు, వజ్రపుకొత్తూరు, సీసీఎస్ ఎస్ఐలు సందీప్‌కుమార్, లక్ష్మణరావు, నిహార్, వెంకటరావులతో పాటు కొంతమంది సిబ్బంది టీమ్‌గా ఏర్పడ్డారు. మంగళవారం జేఆర్ పురం అరజాడ జంక్షన్ ఫ్లై ఓవర్ వద్ద ముందుగా వచ్చిన సమాచారం ప్రకారం మాటు వేయగా.. బైక్‌లపై వెళ్తున్న ఐదుగురు దొరికిపోయారు. మరో నలుగురిని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అక్కడి పోలీసులు పట్టుకున్నారు. ఇక్కడ దొరికిన వారి వద్ద నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, చోరీకి ఉపయోగించే కట్టర్లు, ఇతర పరికరాలు, బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. కోనసీమలో పట్టుబడిన వారి నుంచి కారును స్వాధీనం చేసుకున్నారు. రికవరీ కానివి ఐదుంపావు తులాల బంగారం, 800 గ్రాముల వెండి ఉంది. ఇందులో లీడర్‌గా వ్యవహరించిన సూర్యం దొంగతనంగా వచ్చిన సొమ్ముతో రూ. 40 లక్షల విలువ గల ఇల్లు కూడా నిర్మించడం విశేషం ఆయనది హిరమండలం కాగా.. ఏలూరులో ఉంటారు. కోనసీమలో ఇతడిని పట్టుకున్నారు.

మన జిల్లా వారే..

దొరికిన తొమ్మిది మందిలో ఏడుగురు మన జిల్లావారే కావడం గమనార్హం. వీరిలో ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన కూర్మాన శ్రీనివాసరావు అలియాస్ నాని (గొట్టిపల్లి), సవర సీపాన్య అలియాస్ రవి (కొత్త జోగివలస), సవర భోగేష్ (కారిగూడ), సవర సిద్ధు (కారిగూడ), అలాగే హిరమండలానికి చెందిన సవర సూర్యం (గుర్రాల మెట్ట), సవర చిన్నారావు (గుర్రాలమెట్ట), కొత్తూరు మండలానికి చెందిన సవర మల్లేశ్వరరావు (అడ్డాయిగూడ)లు ఉన్నారు. అలాగే మన్యం పార్వతీపురం జిల్లా సీతంపేటకు చెందిన కాకినాడ కృష్ణారావు, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం మిన్‌పూర్ గ్రామానికి చెందిన బత్తిన శ్రీకాంత్‌లు ఉన్నారు.

2021 నుంచి చోరీలు..

వీరంతా ఒకరికి ఒకరు పరిచయమై ముఠాగా ఏర్పడి 2021 నుంచి చోరీలను మొదలెట్టారు. ముందుగా మిల్లుల్లో చోరీలకు పాల్పడినా అనుకున్నంత సొమ్ము సమకూరకపోవడంతో భారీ నేరాలు చేయాలని పన్నాగం పన్నారు. ఈజీ మనీ.. ఈజీ టార్గెట్ నినాదంతో.. ఊరికి దూరంగా ఉండి.. ప్రజల ఉనికి లేని దేవాలయాల ప్రాంతాలను, నివాస గృహాలను (సీసీ కెమెరాలు లేనివి) ఎంచుకునేవారు. ముందుగా కొన్ని రోజులు రెక్కీ చేసేవారు. సీసీ కెమెరాలుండే దేవాలయాల్లో అయితే చోరీకి ముందు వాటిని కట్టర్స్, వివిధ పరికరాలతో కోసేసి డీవీఆర్‌లు నీటిలో పడేసి అనంతరం దోపిడీకి ఎగబడేవారు. 2021 నుంచి జిల్లాలోని 31 దేవాలయాలు, ఒక చర్చి, మూడు రైసుమిల్లులు, నాలుగు నివాస గృహాల్లో చోరీ చేశారు. పొందూరు మండలం నందివాడలో దుర్గామాత, ఎచ్చెర్ల మండలంలో శ్రీ చక్ర, కోటబొమ్మాళి మండలంలో సాయిబాబా, శివాలయం, గార మండలంలో శ్రీ వెంకటేశ్వర, సాయిబాబా, శ్రీకాకుళం నగరంలో అమ్మవారి దేవాలయంతోపాటు జిల్లాలోని పలు దేవాలయాల్లో చేశారు. అంతే కాక విశాఖ(1), అంబేడ్కర్ కోనసీమ, మెదక్ జిల్లాల్లో నాలుగు చోరీలు చేశారు. మొత్తంగా 43 కేసుల్లో వీరి హస్తముంది.